క్లుప్తంగా

హాస్టల్ తనిఖీ



మాట్లాడుతున్న ఎంఈఓ–2 భాస్కర్‌బాబు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండలంలోని స్థానిక సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాలను గురువారం చంద్రగిరి ఎంఈఓ–2 భాస్కర్‌బాబు తనిఖీ చేశారు. బాలికల సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పరామర్శ

రామచంద్రాపురం: నడవలూరు మాజీ సర్పంచ్ రమణను చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. రమణ ఇటీవల జరిగిన జాతరలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో మోహిత్‌రెడ్డి బాధితునికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట సర్పంచ్ గణపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత భానుకుమార్‌రెడ్డి ఉన్నారు.

సీఏ కోర్సుపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు, ఎస్‌ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎస్‌ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ తిరుపతి బ్రాంచ్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో గురువారం విద్యార్థులకు సీఏ కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఎఫ్ఏ, సీఏఓ రవిప్రసాద్, టీటీడీ డీఈఓ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి హాజరై సదస్సును ప్రారంభించారు. కెరియర్ కౌన్సెలింగ్ కమిటీ జాతీయ అధ్యక్షుడు రోహిత్ రువాటియా, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ అధూకియా, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డి.ప్రసన్నకుమార్, ఎస్‌ఐఆర్‌సీ ఎస్‌ఐసీఏఎస్ఏ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి చార్టెడ్ అకౌంటెన్సీ కోర్స్ గురించి వివరించారు. ఏసీ సురేష్‌కుమార్ విద్యార్థులకు సీఏ కోర్సుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 1,500 మంది విద్యార్థులు, పాఠశాలల యాజమానులు, తిరుపతి ఎస్‌ఐసీఏఎస్ఏ అధ్యక్షుడు జగదీష్ కృష్ణ, కామిశెట్టి బాలాజీ, ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కార్యదర్శి మధుసూదన్ బాబు, కోశాధికారి మన్యం సింహాద్రి, నరసింహులు పాల్గొన్నారు.

ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం ప్రారంభం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం గురువారం వేడుకగా ప్రారంభమైంది. ఈ ఉత్సవం ఈనెల 22వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి ఏకాదశి తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం సమర్పణ నిర్వహించారు. తర్వాత శ్రీఆండాళ్ అమ్మవారిని జీఎస్ మాడ వీధి, గాంధీ రోడ్డు మీదుగా గంగుంద్ర మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహించారు. అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.

తిరుపతి ఆప్ అధ్యక్షుడి నియామకం



మాట్లాడుతున్న నీరుగట్టు నగేష్

తిరుపతి కల్చరల్: ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి నియోజవర్గం అధ్యక్షుడిగా డాక్టర్ ముద్దినేని వెంకటరమణ నియమితులైనట్లు ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటచలపతి తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెంకటరమణకు నియామకపత్రం అందజేసి పార్టీ కండువా అందజేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు జగదీష్, సుభాష్, యశ్వంత్, డాక్టర్ అనుదీప్, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ లడ్డూ కౌంటర్ల నిర్వహణ

తిరుమల: శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలను అందించడంలో భాగంగా పది లడ్డూ కౌంటర్ల నిర్వహణను చేపట్టినట్లు ఎల్ఐసీ ప్రాంతీయ మేనేజర్ దీపా శివదాసన్ తెలిపారు. ఎల్ఐసీ తరపున లడ్డూ కౌంటర్ల నిర్వహణను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ పది లడ్డూ కౌంటర్ల నిర్వహణ ఖర్చులను ఎల్ఐసీ భరించనుందని తెలిపారు. టీటీడీ ఏఈవో ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఇస్రో స్పేస్ కమిషన్ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఇస్రో స్పేస్ కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. శుక్రవారం ఇస్రో నుంచి చంద్రయాన్ రాకెట్ ప్రయోగం జరగనుంది. ఈ నేపథ్యంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రయోగం విజయవంతం కావాలని కోరుకున్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా ఉందాం

- జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, ముద్రనారాయణ

తిరుపతి మంగళం: రాష్ట్ర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్న అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమం తిరుపతిలోని 18వ డివిజన్ న్యూమారుతీనగర్, 17, 19 డివిజన్లకు సంబంధించి అన్నమయ్య సర్కిల్ వద్దనున్న సచివాలయాల వద్ద, 26వ డివిజన్‌కు సంబంధించి జబ్బార్ లేఔట్ నందు గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె.బాబు సర్టిఫికెట్లను అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మేయర్ శిరీష మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీలను ఇప్పటికే 98శాతం పూర్తిచేశారని చెప్పారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు తాళ్లూరి రత్నకుమారి, ఆరణి సంధ్య, సులోచన, తాజీన్, రామస్వామి వెంకటేశ్వర్లు, కోటూరు ఆంజనేయులు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు, గంగమ్మ గుడి చైర్మన్ కట్టా గోపియాదవ్, నేతలు తొండమనాటి వెంకటేష్ రెడ్డి, దేవదానం, డిష్ చంద్ర, మబ్బు నాథమునిరెడ్డి, ఉదయగిరి రమేష్, తాళ్లూరి ప్రసాద్, అనీల్, కుమార్, జీవరత్నం రెడ్డి, మోహన్, శ్యామల పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచిలా జగనన్న సురక్ష



మల్లంగుంటలో సర్టిఫికెట్లను అందజేస్తున్న మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: గడప గడపకు వెళ్లి ప్రజలకు కావాల్సిన సేవలను అడిగి మరీ అందించే జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికి దిక్సూచిలా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. తిరుపతి రూరల్ మంగళం, రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల మండలాల్లో పలు పంచాయతీల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఒక్కరోజే 4,494 సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు ఉచితంగా అందజేశారు. సర్టిఫికెట్లు అందుకున్న దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయ



మోహిత్‌రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

డంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎవరూ సాటి రారని పేర్కొన్నారు. ప్రజాసేవకు నిరంతరంగా పరితపించే సీఎం జగనన్న, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేస్తానని ఆశీర్వదించి ఆదరించాలని కోరారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన భూమన



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి మంగళం: తిరుపతి 18వ డివిజన్ శాంతినగర్‌లో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో నూతన రహదారులు నిర్మించడం, పాడైపోయిన రహదారులను మరమ్మతులు చేయించే కార్యక్రమం వేగంగా చేపడుతున్నట్లు వివరించారు. రూ.20 లక్షల వ్యయంతో 18వ డివిజన్ శాంతినగర్‌లో సిమెంట్ రోడ్డుతోపాటు కాలువలు కూడా నిర్మించినట్లు తెలిపారు. అదేవిధంగా మరిన్ని రోడ్లను త్వరలో ప్రజల ఉపయోగార్థం ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 18వ డివిజన్ కార్పొరేటర్ సులోచన, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తిరుపతి మునిరామిరెడ్డి, స్టేట్ ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు, జెన్ అకాడమీ రాజేష్, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్, నాయకులు సోమశేఖర్ రెడ్డి, మాకం చంద్ర, మనోహర్‌రెడ్డి, కుమార్, మబ్బునాథముని రెడ్డి, దేవదానం, శ్యామల, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సరికొత్త హంగులతో కియా ఎం డ్రైవ్

- నూతన కారు ఆవిష్కరణ



కారును ఆవిష్కరిస్తున్న ఎండీ జగన్నాథరెడ్డి, హోషిమరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): సరికొత్త హంగులతో కియా ఎం డ్రైవ్‌ను మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చినట్లు కియా హోషి ఆటోప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జగన్నాథరెడ్డి అన్నారు. నూతనంగా మార్కెట్‌లోకి వచ్చిన కియా కియా ఎం డ్రైవ్ కారును గురువారం సాయంత్రం ఆయన తన షోరూంలో డైరెక్టర్ చెరకు నిరంజన్, భారతి, హోషిమ రెడ్డి, అశోక్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కియా కంపెనీ నుంచి విడుదల చేయబోతున్న మొట్టమొదటి ట్యాక్సీ కారుగా ఎం డ్రైవ్ కారును ఆవిష్కరించామన్నారు. ఈ కారు అత్యాధునిక సదుపాయాలతో అందుబాటులో ఉన్నాయన్నారు. నూతన కారు బుకింగ్ కోసం 86888 29739 నంబరును సంప్రదించాలని కోరారు. కియా కంపెనీ ఏఎస్ఎం వంశీ, షోరూం జీఎం సతీష్‌బాబు, మేనేజర్ సోమనాథ్ లాల్ పాల్గొన్నారు.

ఆస్తిని ఇప్పించి న్యాయం చేయండి

తిరుపతి కల్చరల్: తన సొంత సంపాదనతో సంపాదించుకున్న ఇంటిని తనది కాదంటూ అడ్డుకుంటూ తమ కుటుంబంలో చిచ్చుపెడుతున్న వారిపై చర్యలు తీసుకుని తన ఇంటిని తనకు ఇప్పించాలని బాధితుడు రాజశేఖర్ మీడియా ముందు వేడుకున్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన తండ్రి మనోహర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. వృత్తి రీత్యా బెంగళూరులో పనిచేస్తున్న తాను తిరుపతిలో ఉన్న తన తల్లిదండ్రుల ద్వారా తన సంపాదనతో తాతయ్యగుంట వద్ద 2011లో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి తన తల్లి పేరున రిజిస్ట్రేషన్ చేయించానని తెలిపారు. తర్వాత కెనడాకు వెళ్లిన తాను అక్కడి నుంచి డబ్బులు పంపి ఇంటి స్థలంలోని రేకుల షెడ్డు తొలగించి ఐదు అంతస్తుల భవనం నిర్మించుకున్నారన్నారు. అనంతరం ఇంటి స్థలాన్ని తన పేరుకు చేసుకుని అప్పటి నుంచి 11 ఏళ్లుగా నగర పాలక సంస్థకు పన్నులు చెల్లించేవాడనని తెలిపారు. అయితే కొందరు తన తల్లిని మభ్యపెట్టి ఇంటి పన్నును తన తల్లిపేరున మార్చివేశారని వాపోయారు. ఈ విషయం తెలిసి అప్పటి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలిని కలిసి సమస్యను తెలియజేయడంతో విచారణ చేసి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారని తెలిపారు. గిరిధర్‌నాయుడు అనే వ్యక్తి మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై తమ ఇంటిని తమకు కాకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై అడిగినందుకు గిరిధర్‌నాయుడు తనకు 10 లక్షలు ఇస్తే పరిష్కరిస్తానని చెబుతున్నాడని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మీ బిడ్డను మా గుండెల్లో పెట్టుకుంటాం

- గడప గడప ఆత్మీయ పలకరింపులో చెవిరెడ్డి లక్ష్మి



తిరుమలనగర్‌లో చెవిరెడ్డి లక్ష్మికి హారతులు పడుతున్న మహిళలు

తిరుపతి మంగళం: మీ బిడ్డను మా ఇంటి బిడ్డగా చూసుకుని గుండెల్లో పెట్టుకుంటామని తిరుమలనగర్ పంచాయతీ ప్రజలు చెవిరెడ్డి లక్ష్మితో చెప్పారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి గురువారం తిరుమలనగర్‌లో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ప్రతి గడపకు వెళ్లి అందరిని ఆత్మీయంగా పలకరిస్తూ వారి బాగోగులను తెలుసుకుంటూ వచ్చే ఎన్నికల్లో తమ బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని అభ్యర్థించారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మా ఇంటి బిడ్డగా చూసుకుంటామని స్థానిక మహిళలు ఆనందంగా చెప్పారు. ఎమ్మెల్యేగా చెవిరెడ్డి చేసిన సేవలను ఎలా మరిచిపోతామని, ఆయన బిడ్డను గెలిపించుకుని రుణం తీర్చుకుంటామని చెప్పారు. చెవిరెడ్డి లక్ష్మికి మహిళలు హారతులతో నీరాజనం పలికారు. తిరుపతి రూరల్ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు, ఉపసర్పంచ్ తిరుమలప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు శ్రావణ్, వార్డుమెంబర్ రమేష్, నేతలు గుండ్రాజు వంశీ, గణేష్, దయా పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో నూతన భవనానికి భూమి పూజ



నూతన భవనానికి భూమి పూజ చేస్తున్న అధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ మెడికల్ కళాశాల విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో తరగతి గదులను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో గురువారం రూ.26 కోట్లతో నిర్మించే నూతన భవనానికి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభువు భూమిపూజ చేశారు. నాడు – నేడు పథకం కింద ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగానే వైద్య విద్యార్థులకు అవసరమైన ఆధునిక తరగతి గదులను నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వసుంధరాదేవి, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ లక్ష్మీపతిరెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ రమణమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్: నాడు–నేడులో భాగంగా ఎస్వీ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఉపాధ్యాయులకు 15రోజుల పాటు నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు సమావేశానికి ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్మార్ట్ టీచింగ్ అండ్ లెర్నింగ్‌లో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కోర్సుకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ హెడ్ డాక్టర్ ఎం.హుమేరా ఖానంను అభినందించారు. డీఈఓ డాక్టర్ వి.శేఖర్, డీఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీధర్, లత సురేష్, డాక్టర్ ఉషారాణి, ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ అకడమిక్ కన్సల్టెంట్లు రామయ్య, హేమ, హిమచందన, సాజిదా పాల్గొన్నారు.

దోపిడీకి చిరునామా సుగుణమ్మ కుటుంబం

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు శ్రీదేవి ధ్వజం



మాట్లాడుతున్న శ్రీదేవి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఎక్కడ పడితే అక్కడ భూకబ్జాలు చేస్తూ దోపిడీకి చిరునామాగా మారిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కుటుంబానికే దక్కుతుందని కో ఆప్షన్ సభ్యురాలు రుద్రగోపి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ కాపునాడు మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గీతాయాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శ్రీదేవి మాట్లాడుతూ ఎమ్మెల్యే పదవి అనుభవించిన సుగుణమ్మ కుటుంబం దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏనాడు తిరుపతి అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నేడు బాబు మెప్పు కోసం ఎమ్మెల్యే భూమనపై పసలేని విమర్శలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. నాలుగేళ్లుగా తిరుపతి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే భూమన, ఆయన తనయుడు డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. గతంలో తాను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో సుగుణమ్మ దొంగ ఓట్ల భాగోతం బట్టబయలైందన్నారు. ఓటు హక్కులేని పిల్లల చేత ఓట్లు వేయించడమేకాక తన 10 ఏళ్ల మనవడితో ఓటు వేయించిన సుగుణమ్మ నేడు తామే నిజాయితీపరులని మాట్లాడడం విడ్డూరమన్నారు. నీ భర్త మరణాంతరం నీవు అభ్యర్థిగా పోటీలో నిలబడితే నీ గెలుపు కోసం పోటీ నుంచి తప్పుకున్న నిజాయితీ నాయకుడు ఎమ్మెల్యే భూమన అని గుర్తించుకోవాలన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కార్పొరేటర్ దూది కుమారి, వైఎస్సార్‌సీపీ కాపునాడు జిల్లా అధ్యక్షురాలు గల్లా కవిత పాల్గొన్నారు.

శ్రీనివాససేతుపై గడ్డర్ల అమరిక పూర్తి



గడ్డర్ల అమరికను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ హరిత

- కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి మంగళం/ తుడా: తిరుపతి శ్రీనివాససేతు ప్రాజెక్టులో రైల్వే వంతెనపై నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం మిగిలిన రెండు ఐరన్ గడ్డర్లను అమర్చారని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన శ్రీనివాససేతు పిల్లర్లపై గడ్డర్లు అమర్చే పనులను గురువారం కమిషనర్ పర్యవేక్షించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ శ్రీనివాససేతు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన గురువారం రెండు గడ్డర్లను అమర్చడంతో మొత్తం ఆరు గడ్డర్లను అమర్చే ప్రకియ పూర్తి అయ్యిందన్నారు. శ్రీనివాససేతు పూర్తి నిర్మాణం మరో నెల రోజులు పడుతుందని ఆమె తెలిపారు. కమిషనర్ వెంట ఎస్ఈ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్ ప్రతినిధి స్వామి, ఏయికామ్ ప్రతినిధి బాలాజి ఉన్నారు.

లైటింగ్ ఆకర్షణీయంగా ఉండాలి..

తిరుపతిలోని రైల్వే వంతెనల కింద లైటింగ్ సిస్టమ్ ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. చెన్నై ఫిలిప్స్ ఏజెన్సీ తీసుకొచ్చిన అధునాతన, కలర్స్ ప్రతిబింబించే లైట్ల డెమోను కమిషనర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. అధికారులతో కమిషనర్ హరిత మాట్లాడుతూ రాత్రుల్లో ఆకర్షణీయమైన లైటింగ్ సిస్టమ్ ప్రజలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. ఫిలిప్స్ ఏజెన్సీ వారు డెమో చూపించిన ఫాసేడ్ లైటింగ్ సిస్టమ్‌ను పరిశీలిస్తూ తగు నిర్ణయం తీసుకొని లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు త్వరలో ఆమోదం తెలుపుతామని చెప్పారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ డీఈ నరేంద్ర, ఏయికామ్ ప్రతినిధి బాలాజి పాల్గొన్నారు.